క్లుప్తంగా

ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడిగా శ్రీకాంత్


శ్రీకాంత్

షాద్‌నగర్: ఫరూఖ్‌నగర్ మండల ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా దూసకల్ గ్రామానికి చెందిన సంగెం శ్రీకాంత్ ఎన్నికయ్యారు. శుక్రవారం షాద్‌నగర్ పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెబాబయ్య శ్రీకాంత్‌కు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీని గ్రామ స్థాయిలో బలోపేతం చేసేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం శ్రీకాంత్ మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నష్టపోయిన పంటల పరిశీలన


దేవునిఎర్రవల్లి గ్రామంలో పంటలను పరిశీలిస్తున్న అధికారులు

చేవెళ్ల: వర్షాలతో నష్టపోయిన పంటలను వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు పరిశీలించారు. శుక్రవారం మండల వ్యవసాయాధికారి శంకర్‌లాల్, ఉద్యానశాఖ అధికారి డి కీర్తి, ఏఈఓ రమేశ్‌లు దేవునిఎర్రవల్లి, కమ్మెట గ్రామాల్లో పర్యటించారు. కూరగాయ పంటలు, పత్తి తదితర పంటలను పరిశీలించి రైతులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సలహాలు, సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా రైతుల పొలాల్లో వర్షపు నీరు చేరిందన్నారు. వెంటనే తమతమ పొలాల్లో నీరు నిల్వ లేకుండా చేసుకోవాలన్నారు. పలు కూరగాయ పంటలు వర్షాలకు దెబ్బతిన్నాయన్నారు. టమాటా పూర్తిగా ధ్వంసమైందన్నారు. పత్తి పంటలకు నీరు కాస్తా ఎక్కువైనప్పటికీ నీటిని తీసి వేసి త్వరగా కోలుకోవటానికి 19:19:19 లేదా 13-0-45లను లేదా 10 గ్రాముల యూరియా లీటరు నీటిని కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేసుకోవాలన్నారు. నేల ద్వారా వ్యాప్తి చెందే ఎండు తెగుళ్ల నివారణకు 3 గ్రాముల కాపర్ ఆక్సి క్లోరైడ్ లేదా ఆల్ప్రేయూరియా ఆకు పచ్చ తెగుళ్లకు 2.5 గ్రాముల కార్బెండజిమ్+ మ్యాంకోజైబ్ శిలీంధ్రనాశక మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. ఈ విషయంలో రైతులు అధైర్యపడకుండా తగిన జాగ్రత్తలు పాటిస్తే పంటలను కాపాడుకోవచ్చునని చెప్పారు.

చవితి వేడుక.. కళల వేదిక

నేటి నుంచి వినాయక నవరాత్రులు


తాళ్లపల్లిలో వినాయక పూజలో ప్రజలు (ఫైల్)

షాబాద్: భక్తితో భజనలు, పాటలతో సంస్కృతిని ప్రతిబింబించేలా గణపతి ఉత్సవాలు నిర్వహిస్తారు. కోలాటం... జానపద గేయాలు... అలరించే శాస్త్రీయ నృత్యాలు... ఒక్కటేమిటి... వినాయక నవరాత్రులు సందర్భంగా వేడుకలు నేటి నుంచి కనువిందు చేయనున్నాయి. ఆయా కార్యక్రమాలు నిర్వహణకు గణేశ్ ఉత్సవ కమిటీలు తగిన ఏర్పాట్లు చేసుకున్నాయి.

ప్రతీ సవంత్సరం నిర్వహించే గణేష్ ఉత్సవాలు

మండలంలోని వివిధ యువజన సంఘాల ఆధ్వర్యంలో ఏటా గణేశ్ ఉత్సవాలను నిర్వహించడం అనవాయితీ. వివిధ యువజన, వ్యాపార, విద్యార్థి సంఘాలు గణేశ్ ఉత్సవ కమిటీలుగా ఏర్పడి నవరాత్రుల సందర్భంగా ఆయా కార్యక్రమాలను నిర్వహిస్తుంటాయి. 9 లేదా 11 రోజుల పాటు ఆయా సంఘాలు నిర్వహించే కార్యక్రమాలు ఎన్నో ఉన్నాయి. ఇవన్నీ తెలుగు ,దనాన్ని పంచుతూ అలరిస్తాయి. ఇక చివరి రోజు ఇలాంటి కార్యక్రమాల పరం పరతారా స్థాయిలో చేరుకుంటుంది. రాత్రి నుంచి ఉదయం వరకూ కార్యక్రమాలు కొనసాగుతాయి. స్థానికులే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి వచ్చే కళాకారులు ఈ కార్యక్రమాలకు రావడం, తమదైన కళలతో అలరింపజేస్తారు.

శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు...

ఉత్సవాల సందర్భంగా శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు, జానపద నృత్యాలు, కోలాటాలు, భజనలు, పాటలు, సంప్రదాయ నృత్యాలు లాంటివి ఉంటాయి. నాటక ప్రదర్శనలూ చోటుచేసుకుంటాయి. గ్రామాల్లో సరస్వతీ శిశుమందిర్ విద్యార్థులు ఇలాంటి ప్రదర్శనల్లో ముందుంటారు. విద్యార్థులు జానపద గీతాలు, నృత్యాలు, కోలాటం, భజనలు వంటివి నిర్వహిస్తుంటారు. అంతరించిపోతున్నా తెలుగు కళలను నేటి తరాలకు పరిచయం చేస్తూ వాటి మీద మరింతా శ్రద్ధ పెరిగేలా గణేశ్ ఉత్సవాల ద్వారా ఆయా సంఘాలు కృషి చేయడం ప్రశంసనీయం.

చినుకు పడితే.. పాఠశాల మూతే!

- రామచంద్రాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల దుస్థితి
- పెచ్చులూడుతున్న భవనం స్లాబు
- పక్క గ్రామానికి మార్చిన అధికారులు
- వరండాలో ఆరుబయట కొనసాగుతున్న చదువులు
- ఇబ్బందుల్లో విద్యార్థులు



పులుసుమామిడి పాఠశాల వరండాలో చదువుకుంటున్న విద్యార్థులు

కొందుర్గు: రామచంద్రాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల భవనం పైకప్పు పెచ్చులూడిపోయి శిథిలావస్థకు చేరింది. కొద్దిపాటి చినుకు పడితే అంతే సంగతులు...ఆ వర్షపునీరంతా పాఠశాల గదుల్లోకి చేరుతుంది. బురదగా తయారవుతుంది. ఇది రామచంద్రాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల దుస్థితి. కొందుర్గు మండలంలో ఈ ప్రాథమికోన్నత పాఠశాలలో 7 తరగతులకు గాను 52 మంది విద్యార్థులు విద్యానభ్యసిస్తున్నారు. ఇక్కడ హెచ్‌ఎం రాములమ్మ, ఇద్దరు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. పదిహేను రోజులుగా కురుస్తున్న వర్షాలకు వర్షపునీరంతా గదుల్లో చేరి ఇబ్బందికరంగా మారింది. పాఠశాల గదుల పైకప్పు పెచ్చులూడి వర్షపునీరంతా గదుల్లో చేరుతుంది. ఈ విషయాన్ని ఉపాధ్యాయులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

పులుసుమామిడి పాఠశాలలో కొనసాగించండి..

వర్షం కురిస్తే పాఠశాలను పక్కనే ఉన్న పులుసుమామిడి పాఠశాల భవనంలో కొనసాగించాలని అధికారులు ఆదేశించారు. ఈ సందర్భంగా రామచంద్రాపూర్ పాఠశాలను పులుసుమామిడి పాఠశాల భవనంలో నడుపుతున్నారు. పులుసుమామిడి పాఠశాల భవనంలో రెండు గదులు మాత్రమే ఉండటం వల్ల ఒక గదిలో పులుసుమామిడి పాఠశాలకు చెందిన ఐదోతరగతి విద్యార్థులను, మరో గదిలో రామచంద్రాపూర్‌కు చెందిన ఏడోతరగతి విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. దీంతో తమకు ఇక్కడ ఇరుకుగా ఉందని, ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలపై శ్రద్ధ పెట్టలేకపోతున్నామని, పాఠాలు అర్థం కావడం లేదని వాపోతున్నారు. విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.


వర్షంతో తడిసిన తరగతి గది


పెచ్చులూడుతున్న రామచంద్రాపూర్ పాఠశాల భవనం స్లాబు

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

సీపీఐ కౌన్సిల్ సభ్యుడు రామస్వామి, రైతు సంఘం ఉపాధ్యక్షుడు ప్రభులింగం డిమాండ్

చేవెళ్ల: అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను, ఇండ్లు కూలిపోయిన పేదలను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె రామస్వామి, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రభులింగం డిమాండ్ చేశారు. చేవెళ్ల మండల కేంద్రంలో శుక్రవారం సీపీఐ కమిటీ పిలుపు మేరకు నియోజకవర్గ కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఆర్డీఓ కార్యాలయం ముందు ధర్నా చేపట్టి ఆర్డీఓ సాయిరాంకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను, ఇండ్లు కోల్పోయిన బాధితులను, మృతిచెందిన కుటుంబాలకు తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. పంటలు నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ. 20వేల పరిహారం అందజేయాలన్నారు. ఇండ్లు కూలిపోయినవారికి ఇల్లు కట్టుకునేందుకు ఆర్థిక సహాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, రైతు సంఘం నాయకులు సుధాకర్‌గౌడ్, సత్తిరెడ్డి, కె. వేణు, జంగయ్య, గోపాల్‌రెడ్డి, మక్బుల్, శివ, మంజుల, శౌరీలు, లలిత, యాదగిరి, పెంటయ్య, సాయిలు ప్రభాకర్, ఆనందం, తదితరులు పాల్గొన్నారు.


ఆర్డీఓ సాయిరాంకు వినతి పత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

విద్యార్థులకు ప్యాడ్లు అందజేత


పరీక్ష ప్యాడ్లు అందజేస్తున్న విజయ్‌కుమార్

శంకర్‌పల్లి: మండలంలోని మోకిల తండాలో శుక్రవారం తండాకు చెందిన విజయ్‌కుమార్ అనే యువకుడు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు రాములు మాట్లాడుతూ కొన్నేళ్లుగా తండాలోని చాలా మంది యువత తమకి తోచిన విధంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు తోడ్పాటునందించడం శుభపరిణామన్నారు.

వ్యాధులపై అప్రమత్తత అవసరం

డిప్యూటీ డీఎంహెచ్‌వో దామోదర్

శంకర్‌పల్లి: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో దామోదర్ పేర్కొన్నారు. శుక్రవారం శంకర్‌పల్లి మున్సిపాలిటీలోని రిత్విక్ వెంచర్‌లో నిర్వహించిన డ్రై డే- ఫ్రైడే కార్యక్రమంలో చైర్‌పర్సన్ విజయలక్ష్మీతో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలందరూ తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు.


రోడ్డుపై చేరిన వర్షపు నీటిని పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో దామోదర్

వరద బాధితులను ఆదుకోండి

మొయినాబాద్: తెలుగు రాష్ట్రాల్లో వరదలు ముంచెత్తి సర్వం కోల్పోయిన బాధితులకు అందరూ సహాయం చేయాలని చిలుకూరు బాలాజీ దేవాలయ అర్చకుడు రంగరాజన్ పిలుపునిచ్చారు. శుక్రవారం చిలుకూరు బాలాజీ దేవాలయం వద్ద ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విజయవాడ, ఖమ్మంలో ఇటీవల భయంకరమైన వరదలు వచ్చాయన్నారు. వరదలతో అక్కడి ప్రజలు సర్వం కోల్పాయారని, వారిని ఆదుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ధనం, వస్తు రూపేణ సహాయం అందించి మానవత్వాన్ని చాటుకోవాలన్నారు. విదేశాల్లో ఉన్నవారు సైతం ఆదుకోవాలని కోరారు.


మాట్లాడుతున్న రంగరాజన్

పేదల సంక్షేమమే ధ్యేయం

ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలను ఆపదలో ఆదుకునేందుకు సీఎం రిలీఫ్ ఫండ్ ఉపయోగపడుతుందన్నారు. ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం కోసం దీన్ని ఉపయోగించుకోవాలన్నారు. ఇచ్చిన మాట కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎళ్లవేళల పని చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మధుసూదన్‌రెడ్డి, ఎం. క్రిష్టారెడ్డి, డీవీఆర్, ఆగిరెడ్డి, ఎస్. వసంతం, మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, పెంటయ్యగౌడ్, సాత ప్రవీణ్‌కుమార్, సురేందర్, పాండు, రాంచంద్రయ్య, నరేందర్, రాములు, చెన్నయ్య, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య తదితరులు

ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోండి

షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి

కేశంపేట: గణేష్ ఉత్సవాలను భక్తులు, ప్రజలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి పేర్కొన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులకు, ప్రజలకు అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ రంగస్వామి మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలను ప్రభుత్వ నిబంధనలకు లోబడి నిర్వహించుకోవాలన్నారు. మండపాల వద్ద విద్యుత్‌శాఖ నుంచి అనుమతులు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో ఉత్సవ కమిటీ సభ్యులు ఆన్‌లైన్ ద్వారా పోలీస్‌శాఖకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ రూరల్ సీఐ సత్యానారాయణ, కేశంపేట ఎస్‌ఐ రాజ్‌కుమార్, తహసీల్దార్ అజాంఅలీ, ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి, ఎంపీఓ కిష్టయ్య, విద్యుత్ ఏఈ ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ రంగస్వామి

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య

షాద్‌నగర్: స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెబాబయ్య పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఫరూఖ్‌నగర్ మండల అధ్యక్షుడు దొడల వెంకటేశ్ యాదవ్ ఆధ్వర్యంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అందె బాబయ్య మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ప్రధాని మోదీ అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలను రూపొందించి విజయవంతంగా అమలు చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను, పథకాలను పార్టీ నాయకులు ఇంటింటికీ తీసుకెళ్లాలన్నారు. వారితో మాట్లాడి చైతన్యవంతులను చేయాలన్నారు. అదేవిధంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు నాయకులు కృషి చేయాలన్నారు. గ్రామ స్థాయిలో పార్టీని బలపరచాలన్నారు. ప్రతిఒక్కరూ పార్టీ సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలని కోరారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు నాయకులు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో కక్కునూరి వెంకటేష్‌గుప్తా, మనోహర్‌రెడ్డి, ఎం కనోళ్ల వెంకటేశ్, ఇస్నాతి శ్రీనివాస్, లష్కర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బాబయ్య

'పర్యావరణ పరిరక్షణే లక్ష్యం'

చేవెళ్ల: మట్టి వినాయక ప్రతిమలను పూజించి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని పర్యావరణ అవార్డు గ్రహీత, సామాజిక వేత్త పి రామక్రిష్టారావు పేర్కొన్నారు. చేవెళ్ల మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయం వద్ద ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం మట్టి వినాయకుల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ హితంకోసం పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో క్రిష్ణపంతులు తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయక ప్రతిమలను పూజించాలి: కొందూటి నరేందర్

షాద్‌నగర్: పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకుల ప్రతిమలను పూజించాలని మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్ పేర్కొన్నారు. పట్టణంలోని 25వ వార్డులో కౌన్సిలర్ నంద మాధురి ఆధ్వర్యంలో మలిపెద్ది శ్రీనివాసులు గుప్తా మట్టి గణేష్ ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో పర్యావరణం పూర్తిగా కలుషితమవుతుందన్నారు. పట్టణంలోని న్యూసిటీ కాలనీలో వాసవీ క్లబ్ వారు మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో నంద కిషోర్, గుడుపల్లి వెంకటరమణ, ఎల్కుర్తి శ్రీనివాస్, నారాయణ, నాగరాజు, సూరిశెట్టి నర్సిహ్మగుప్తా, తదితరులు పాల్గొన్నారు.

షాబాద్‌లో..

షాబాద్: మట్టి వినాయకులను పూజిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దామని లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్ పేర్కొన్నారు. షాబాద్ మండల కేంద్రంలో మట్టి వినాయకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు లింగప్ప, మల్లికార్జున్, శ్రీనివాస్, శ్రీకర్, కురుణాకర్‌చారి, బస్వరాజ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

శంకర్‌పల్లిలో..

శంకర్‌పల్లి: ప్రజలందరూ మట్టి గణపతులనే పూజించాలని శంకర్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి అన్నారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట కమిషనర్ శ్రీనివాస్, వైస్‌చైర్మన్ వెంకట్‌రాంరెడ్డితో కలిసి మట్టి గణపతుల ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ అంజన్‌కుమార్, టీపీఓ భాస్కర్, పర్యావరణాధికారి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.


చేవెళ్ల: హనుమాన్ దేవాలయం వద్ద వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న రామక్రిష్టారావు



మట్టి వినాయకుల ప్రతిమలను పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్


షాబాద్: ప్రతిమలను పంపిణీ చేస్తున్న హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్


శంకర్‌పల్లి: మట్టి గణపతులను పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, కమిషనర్

విద్యాభివృద్ధికి ప్రత్యేక చర్యలు


షాద్‌నగర్: విరాళం అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

- ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పిస్తాం
- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: విద్యాభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు లేవని పాఠశాల సిబ్బంది, నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే స్పందించిన ఆయన రూ. 1లక్షవిరాళంగా అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద విద్యార్థులకు మెరుగైన విద్య అందించడమే లక్ష్యమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కలిప్ంచడం కోసం ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. ప్రతీ విద్యార్థి చదువుల్లో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ప్రైవేటు విద్యా సంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంబటి రాజు, కొత్త లింగం, కక్కునూరి వెంకటేష్‌గుప్తా, పఠాన్‌పాషా, మాలిక్, రావుఫ్, లతీఫ్, సురేందర్, సుదర్శన్, వెంకటేశ్, షబ్బీర్, వెంకటేశ్, బబ్లు పాల్గొన్నారు.

కళాశాల భవన నిర్మాణానికి స్థల పరిశీలన

షాద్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవన నిర్మాణానికి శుక్రవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్థలం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో చెంది తిరుపతిరెడ్డి, కొంకళ్ల చెన్నయ్య, ముబారక్, ఆగీరు రవికుమార్‌గుప్తా, పురుషోత్తంరెడ్డి, ఖదీర్, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి : తహసీల్దార్

కొందుర్గు: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ జగదీశ్వర్ సూచించారు. శుక్రవారం ఆయన ఇంద్రానగర్ గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందించే భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వల్ల దోమలు, ఈగల బెడద పెరుగుతుందన్నారు. దీనికోసం వంటగదిని శుభ్రంగా ఉంచుకోవాలని, పాత్రలపై ఎప్పుడూ మూతలు ఉంచాలని సూచించారు. తాజా కూరగాయలనే వాడాలని, వేడి పదార్థాలనే విద్యార్థులకు వడ్డించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఇంద్రానగర్ గురుకుల పాఠశాలలో ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ జగదీశ్వర్